ప్రజా
# రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం

స్మార్ట్ ఎడిషన్
EVENING 6 PM

సంపుటి (Volume): 1 ✦ సంచిక (Issue): 204 ✦ Published From: నంద్యాల (Nandyal) ✦ పేజీలు 2 ✦ https:www.prajarepublic.com ✦ వెల - 1/- | శుక్రవారం 28 ఫిబ్రవరి 2025

RNI No: APTEL/2023/87888 | Andhrapradesh, Telangana, Kurnool, Vijayawada, Vishakapatnam, Tirupati, Ananthapuram, Rajamahedravaram, Guntur, Nellore, Srikakulam, Thadepallegudem, Kadapa, Ongole






## రాష్ట్రానికి నిధుల మంజూరు చేయించడం కిషన్ రెడ్డి బాధ్యత: సీఎం రేవంత్

రాష్ట్రానికి నిధులు మంజూరు చేయించడం కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి బాధ్యతని తెలంగాణ సీఎం. రేవంత్ రెడ్డి అన్నారు.



**హైదరాబాద్, ఫిబ్రవరి 28, (రిపబ్లిక్ న్యూస్):** రాష్ట్రానికి నిధులు మంజూరు చేయించడం కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి బాధ్యతని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు ఆయనకు సీఎం లేఖ రాశారు. కిషన్‌రెడ్డి కేంద్ర మంత్రిగా ఉండగానే చెన్నై, బెంగళూరు మెట్రో విస్తరణకు ఆమోదం లభించిందన్నారు. హైదరాబాద్ మెట్రోపై మాత్రం పలుమార్లు విజ్ఞప్తి చేసినా పురోగతి లేదన్నారు. సబర్మతి, గంగా పునరుజ్జీవనంపై కిషన్‌రెడ్డి పలుమార్లు ప్రకటనలు చేశారని.. మూసీపై ఎందుకు విషం చిమ్ముతున్నారని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రాజెక్టుల విషయంలో కిషన్‌రెడ్డి పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. "ప్రాజెక్టులపై మాట్లాడితే.. మమ్మల్ని అడిగి ఇచ్చారా? అంటూ విమర్శిస్తున్నారు. నాది అవగాహనా రాహిత్యమని కిషన్‌రెడ్డి అనడం తీవ్ర అభ్యంతరకరం. కేంద్ర మంత్రిగా ఉన్నమీరు తెలంగాణ ప్రజలకు ఏం చేశారో చెప్పండి? వైఫల్యాలు కప్పిపుచ్చుకునేందుకు ఎదురుదాడి చేయడం సమంజసం కాదు. ఇకనైనా రాష్ట్ర ప్రాజెక్టులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని విజ్ఞప్తి చేస్తున్నాం" అని లేఖలో రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

## విభేదాలకు తావులేదు.. గ్రూపులు సహించబోను: సీఎం చంద్రబాబు

కష్టాల్లో కూడా మంచి బడ్జెట్(2025-26)ను ప్రజలకు అందించామని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు.



**అమరావతి, ఫిబ్రవరి 28, (రిపబ్లిక్ న్యూస్):** కష్టాల్లో కూడా మంచి బడ్జెట్ (2025-26)ను ప్రజలకు అందించామని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యమిస్తూ బడ్జెట్ రూపకల్పన చేసినట్లు చెప్పారు. అసెంబ్లీ కమిటీ హాల్లో సీఎం చంద్రబాబు అధ్యక్షతన టీడీఎల్పీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా బడ్జెట్ను ఉద్దేశించి మాట్లాడిన సీఎం.. ఎమ్మెల్యేలు, ఎంపీలకు దిశానిర్దేశం చేశారు. వైకాపా పాలనలో ఆర్థిక విధ్వంసం జరిగిందని ప్రజలు గుర్తించారన్నారు.



ఈ బడ్జెట్ను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లే బాధ్యత ఎమ్మెల్యేలదే అని అన్నారు. కొత్తగా వచ్చిన ఎమ్మెల్యేలు అవగాహన పెంచుకోవాలన్నారు. వచ్చే ఎన్నికల్లో టికెట్ దక్కాలంటే ఎమ్మెల్యేల పనితీరులో మార్పు రావాలని చెప్పారు. మళ్లీ సభకు రావాలి.. అనే భావనతో ఎమ్మెల్యేల పనితీరు ఉండాలని పేర్కొన్నారు. ఎంపీలు, ఎమ్మెల్యేలకు మధ్య సమన్వయం ఉండాలని స్పష్టం చేశారు. ఎక్కడా విభేదాలకు తావులేదని.. గ్రూపులు సహించబోనని చంద్రబాబు తేల్చి చెప్పారు.

## రూ. 3.22 లక్షల కోట్లతో ఏపీ వార్షిక బడ్జెట్.. అసెంబ్లీలో ప్రవేశపెట్టిన మంత్రి పయ్యావుల

ఏపీ శాసనసభలో 2025-26 వార్షిక బడ్జెట్ను ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశపెట్టారు. రూ.3.22 లక్షల కోట్లతో బడ్జెట్ను సభ ముందుకు తీసుకొచ్చారు.



**అమరావతి, ఫిబ్రవరి 28, (రిపబ్లిక్ న్యూస్):** ఏపీ శాసనసభలో 2025-26 వార్షిక బడ్జెట్ను ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశపెట్టారు. రూ.3.22 లక్షల కోట్లతో బడ్జెట్ను సభ ముందుకు తీసుకొచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తొలిసారిగా పూర్తిస్థాయి బడ్జెట్ను ప్రవేశపెట్టారు. బడ్జెట్లో వ్యవసాయానికి రూ.48వేల కోట్లు కేటాయించారు. రెవెన్యూ వ్యయం రూ.2,51,162 కోట్లు, మూలధన వ్యయం అంచనా రూ.40,635 కోట్లు, రెవెన్యూ లోటు రూ.33,185 కోట్లు, ద్రవ్య లోటు రూ.79,926 కోట్లుగా అంచనా వేశారు. అన్నదాత సుఖీభవ కోసం రూ.6,300 కోట్లు, ఏపీ జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టు కోసం బడ్జెట్లో రూ.6,705 కోట్లు కేటాయించారు. బడ్జెట్ ప్రవేశపెట్టిన అనంతరం పయ్యావుల మాట్లాడుతూ.. రాష్ట్ర రుణ సామర్థ్యం సున్నాకు చేరుకుందని.. అప్పు తీసుకొనే శక్తి లేని ఏకైక రాష్ట్రంగా ఏపీ మిగిలిందని అన్నారు. అయినప్పటికీ సీఎం చంద్రబాబు స్ఫూర్తితో బడ్జెట్ రూపొందించినట్లు చెప్పారు. 2014-19 మధ్య రాష్ట్రం రెండంకెల వృద్ధి సాధించిందన్నారు. సవాళ్లను ఎదుర్కోవడంలో చంద్రబాబు.. ఆయనకు ఆయనే సాటి అని అన్నారు. రాష్ట్ర విభజన కారణంగా రాజధానిని కోల్పోయిన ఏపీకి అమరావతిని ప్రజా రాజధానిగా చేసుకున్నామన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అమరావతి పనులు పెద్దఎత్తున చేపడతామని చెప్పారు. మహారాష్ట్రకు ముంబయి, తెలంగాణకు హైదరాబాద్ ఎంత ముఖ్యమో.. మనకూ అమరావతి అంతే ముఖ్యమన్నారు. ప్రధాని మోదీ సహకారంతో ముంబయి, హైదరాబాద్ నగరాలకు సరితూగేలా అమరావతిని అభివృద్ధి చేస్తామని పయ్యావుల వెల్లడించారు.

### బడ్జెట్లో కేటాయింపులు ఇలా

- నైపుణ్యాభివృద్ధి శిక్షణ శాఖకు రూ.1,228 కోట్లు
- పాఠశాల విద్యాశాఖకు రూ.31,805 కోట్లు
- ఉన్నత విద్యకు రూ.2,506 కోట్లు
- ఎస్సీల సంక్షేమానికి రూ.20,281 కోట్లు
- ఎస్టీల సంక్షేమానికి రూ.8,159 కోట్లు
- బీసీల సంక్షేమానికి రూ.47,456 కోట్లు
- అల్పసంఖ్యాక వర్గాల కోసం రూ.5,434 కోట్లు
- మహిళా శిశు సంక్షేమం, దివ్యాంగులు, వృద్ధుల సంక్షేమం కోసం రూ.4,332 కోట్లు
- వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమానికి రూ.19,264 కోట్లు
- పంచాయతీ రాజ్ శాఖకు రూ.18,847 కోట్లు
- పురపాలక, పట్టణాభివృద్ధి శాఖకు రూ.13,862 కోట్లు
- గృహ నిర్మాణ శాఖకు రూ.6,318 కోట్లు
- జలవనరుల శాఖకు రూ.18,019 కోట్లు
- పరిశ్రమలు, వాణిజ్య శాఖకు రూ.3,156 కోట్లు
- ఇంధన శాఖకు రూ.13,600 కోట్లు
- ఆర్అండ్బికి రూ.8,785 కోట్లు
- యువజన, పర్యటక, సాంస్కృతిక శాఖకు రూ.469 కోట్లు
- గృహ మంత్రిత్వ శాఖకు రూ.8,570 కోట్లు
- తెలుగు భాష అభివృద్ధి, ప్రచారం కోసం రూ.10 కోట్లు
- మద్యం, మాదక ద్రవ్యాల రహిత రాష్ట్రం కోసం నవోదయ 2.0 కార్యక్రమానికి రూ.10 కోట్లు
- జల్ జీవన్ మిషన్ కోసం రూ.2,800 కోట్లు
- వ్యవసాయ అనుబంధ రంగాలకు రూ.13,487 కోట్లు
- పౌరసరఫరాల శాఖకు రూ.3,806 కోట్లు
- తల్లికి వందనం కోసం రూ.9,407 కోట్లు (2025-26 విద్యా సంవత్సరం నుంచి అమలు)
- ఎన్టీఆర్ భరోసా పింఛన్ల కోసం రూ.27,518 కోట్లు
- ఆర్టీజీఎస్ కోసం రూ.101 కోట్లు
- దీపం 2.0 పథకానికి రూ.2,601 కోట్లు
- మత్స్యకార భరోసాకు రూ.450 కోట్లు
- స్వచ్ఛాంధ్ర కోసం రూ.820 కోట్లు
- డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకానికి రూ.3,486 కోట్లు
- ఆదరణ పథకానికి రూ.1000 కోట్లు

# బార్లను తలపిస్తున్న వైన్ షాపులు

## జిల్లా అంతటా అనుమతి లేని సిట్టింగ్ రూములు
## రద్దీ కూడళ్లలో రోడ్ల పక్కనే మందు సేవిస్తున్న మందుబాబులు





### ఎక్సైజ్ శాఖ అధికారులకు అందుతున్న ముడుపులు


పి.నజీర్ అహమ్మద్ కర్నూలు బ్యూరో

జిల్లావ్యాప్తంగా వైన్ షాపులు బార్లను తలపిస్తున్నాయి. ఎటువంటి అనుమతులు లేకుండానే యదేచ్ఛగా వైన్ షాపుల్లో సెట్టింగ్ రూములు ఏర్పాటు చేసుకొని ఆదాయాన్ని పెంచేసుకుంటున్నారు. సెట్టింగ్ రూములకు ప్రభుత్వం నుండి ఎటువంటి అనుమతులు రాలేదు. అయినా ఇక్కడ వైన్ షాపు యజమానులు ఎక్సైజ్ పోలీస్ శాఖ అధికారుల అండదండలతో పెద్ద పెద్ద షెడ్లు వేసుకుని అమ్మకాలు కొనసాగిస్తున్నారు. అన్ని రకాల బ్రాండ్లు మార్కెట్లో లభ్యం అవుతుండడంతో గతంలో జగన్ ప్రభుత్వ హయాంలో సరైన బ్రాండ్ లేకపోవడంతో తెలంగాణ రాష్ట్రంలో ఉన్న అలంపూర్ కు మందుబాబులు కర్నూల్ నుండి ఎక్కువ సంఖ్యలో వెళ్లేవాళ్లు. ప్రస్తుతం 100 రూపాయల నుండి మద్యం లభిస్తునడంతో అమ్మకాలు ఇక్కడే జోరుగా సాగుతున్నాయి. ఎక్కువ జన సంచారమున్న కొత్త బస్టాండు, కల్లూరు చెన్నమ్మ సర్కిల్, కృష్ణా నగర్, చెక్ పోస్ట్, బళ్లారి చౌరస్తా కూడళ్లలో మందుబాబులు యదేచ్ఛగా ఎలాంటి జంకు లేకుండా రోడ్ల పక్కనే మందు సేవిస్తున్నారు. ఇదంతా చూస్తూ ఉన్నా అటు పోలీస్ శాఖ ఇటు ఎక్సైజ్ శాఖ అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయయక్తమవుతున్నాయి. తప్ప తాగి మందు బాబులు వీరంగం చేస్తున్న కారణంగా పాదాచారాలు వాహనం దారులు భయభ్రాంతులకు గురవుతున్నారు. పోలీస్ శాఖ పనితీరు పట్ల ప్రజలు తీవ్ర విమర్శలు చేస్తున్నారు.




### ఎక్సైజ్, పోలీస్ శాఖ సిబ్బందికి అందుతున్న ముడుపులు

జిల్లావ్యాప్తంగా వైన్ షాపుల యజమానుల నుండి ఎక్సైజ్ పోలీస్ శాఖ సిబ్బందికి ముడుపులు అందుతున్నట్లు విమర్శలు సర్వత్రా వ్యక్తవవుతున్నాయి. అందుకే ఇటువైపు వారు కన్నెత్తి కూడా చూడడం లేదని ప్రజలు అంటున్నారు. అన్ని బ్రాండ్ల లిక్కర్ లభిస్తుందడంతో వ్యాపారాలు జోరుగా కొనసాగుతున్నాయి. రోడ్ల పక్కనే మందు సేవించడాన్ని పోలీసులు అడ్డుకోవాలని ప్రజలు కోరుతున్నారు. మహిళలు అటువైపు వెళ్లాలంటేనే భయభ్రాంతులకు గురవుతున్నారు. కల్లూరు చెన్నమ్మ సర్కిల్ కొత్త బస్టాండ్ పరిసర ప్రాంతాలలో పరిస్థితి మరింత దారుణంగా ఉంది.



### ఉమ్మడి జిల్లాలలో నెలకు 80 కోట్ల రూపాయల అమ్మకాలు

ఉమ్మడి జిల్లాలైన కర్నూలు నంద్యాలలో మద్యం వ్యాపారం మూడు పూవులు ఆరు కాయలుగా అమ్మకాలు కొనసాగుతున్నాయి. నెలకు దాదాపు 80 కోట్ల రూపాయల వరకు అమ్మకాలు జరుగుతున్నట్లు తెలుస్తుంది. సంవత్సరానికి 800 రూపాయల కోట్ల వరకు అమ్మకాలు కొనసాగించేలా ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలుస్తోంది. మద్యం డిపోల నుండి వైన్ షాపులకు పంపిస్తున్న మద్యం వీలైనంత త్వరలో అమ్మకాలు వైన్ షాపు యజమానులు అనుమతి లేని సెట్టింగ్ రూములను ఏర్పాటు చేసుకున్నారు. సిట్టింగ్ రూములు లేకుంటే సరిగా జరగదని యజమానులు అంటున్నారు.





### భారీగా షెడ్లు వేసి సిట్టింగ్ సదుపాయం ఏర్పాటు

జిల్లావ్యాప్తంగా ఉన్న వైన్ షాపుల్లో భారీగా షెడ్లు వేసి మందుబాబుల కోసం సెట్టింగ్స్ సదుపాయాన్ని ఏర్పాటు చేస్తున్నారు. గతంలో ఇటువంటి సౌకర్యాలు ఉండేవి కావు. ప్రస్తుతం తెలుగుదేశం హయాంలో మందు బాబులకు అన్ని రకాల బ్రాండ్ మందులు కూడా లభ్యం అవుతుండడంతో వ్యాపారాలు జోరుగా కొనసాగుతున్నాయి.

printed and published by B.Nagendra on behaly of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: B.NAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmali.com

# చరిత్రలో నేటి ప్రత్యేకత

- జాతీయ విజ్ఞానశాస్త్ర దినోత్సవము.
- దర్జీల దినోత్సవము.
- 1927: భారత ఉపరాష్ట్రపతిగా పనిచేసిన కృష్ణకాంత్ జననం (మ.2002).
- 1928: విద్యా, సాహితీ, సామాజిక వేత్త తుమ్మల వేణుగోపాలరావు జననం (మ.2011).
- 1948: రంగస్థల నటీమణి రాజేశ్వరి పువ్వుల జననం.
- 1963: భారత ప్రథమ రాష్ట్రపతి బాబూ రాజేంద్ర ప్రసాద్ మరణం (జ.1884). (చిత్రంలో)
- 2014: తెలుగు రచయిత, సి.పి.బ్రౌన్ స్మారక గ్రంథాలయ ట్రస్టు స్థాపకుడు జానమద్ది హనుమచ్ఛాస్త్రి మరణం (జ.1926).


విజ్ఞానశాస్త్ర దినోత్సవము


దర్జీల దినోత్సవము


కృష్ణకాంత్


వేణుగోపాలరావు


జానమద్ది హనుమచ్ఛాస్త్రి

రిపబ్లిక్ స్పోర్ట్స్

# అఫ్గాన్, ఆస్ట్రేలియా మ్యాచ్కు వర్షం ముప్పు.. రద్దయితే సెమీస్కు చేరేదెవరు?

ఛాంపియన్స్ ట్రోఫీలో భాగంగా అఫ్గానిస్థాన్, ఆస్ట్రేలియా మధ్య జరగాల్సిన కీలక మ్యాచ్కు వరుణుడి ముప్పు పొంచి ఉంది.



పాకిస్థాన్లో జరుగుతున్న ఛాంపియన్స్ ట్రోఫీ మ్యాచ్లకు వరుణుడు ఆటంకం కలిగిస్తున్నాడు. ఇప్పటికే రావల్పిండి వేదికగా జరగాల్సిన ఆస్ట్రేలియా, సౌతాఫ్రికా మ్యాచ్లోతోపాటు పాకిస్థాన్, బంగ్లాదేశ్ మ్యాచ్ వర్షం కారణంగా ఒక్క బంతి పడకుండానే రద్దయ్యాయి. ఎడతెరిపి లేని వర్షం కురవడంతో ఈ రెండు మ్యాచ్లు కనీసం టాస్ కూడా వేయకుండానే వర్షార్పణం అయ్యాయి. నేడు (శుక్రవారం) లాహోర్ వేదికగా అఫ్గానిస్థాన్, ఆస్ట్రేలియాల మధ్య జరగాల్సిన కీలక మ్యాచ్కూ వరుణుడి గండం పొంచి ఉంది. ఈ మ్యాచ్ లో గెలిచిన జట్టు ఇతర సమీకరణాలతో సంబంధం లేకుండా సెమీ ఫైనల్ బెర్తు ఖరారు చేసుకుంటుంది.

## మ్యాచ్ రద్దయితే?

ఇంగ్లాండ్కు షాకిచ్చి జోరుమీదున్న అఫ్గాన్.. కంగారులను కంగుతినిపించాలని సెమీస్ కు దూసుకెళ్లాలని ప్రణాళికలను రచిస్తోంది. గతేడాది టీ20 ప్రపంచకప్లో ఆసీస్ను అఫ్గాన్ మట్టికరిపించిన సంగతి తెలిసిందే. అయితే, అఫ్గాన్ ఆశలపై వరుణుడు నీళ్లు చల్లేలా ఉన్నాడు. ఎందుకంటే శుక్రవారం లాహోర్లో వర్షం కురిసే అవకాశాలు 75 శాతం ఉన్నాయి. దీంతో మ్యాచ్ రద్దయ్యే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయి. మ్యాచ్ ప్రారంభానికి ముందు వర్షం కురిసే ఛాన్స్ 35 శాతం ఉండగా.. రాత్రిపూట భారీ వర్షం పడే అవకాశం ఉంది. కనీసం 20 ఓవర్ల మ్యాచ్ను నిర్వహించడానికి కట్ ఆఫ్ టైమ్ స్థానిక కాలమానం రాత్రి 7 గంటలు. ఒకవేళ మ్యాచ్ రద్దయితే ఆస్ట్రేలియా నాలుగు పాయింట్లతో సెమీస్ బెర్త్ ఖరారు చేసుకుంటుంది. అఫ్గాన్ మూడు పాయింట్లతో టోర్నీ నుంచి నిష్క్రమిస్తుంది. అంతేకాదు ఇప్పటికే మూడు పాయింట్లతో గ్రూప్ బిలో ఉన్న సౌతాఫ్రికా.. ఇంగ్లాండ్తో జరగాల్సిన చివరి లీగ్ మ్యాచ్ సంబంధం లేకుండా నాకౌట్కు చేరుతుంది. ఎందుకంటే అఫ్గాన్ (-0.990) కంటే సౌతాఫ్రికా (ం2.140) నెట్ రన్రేట్ ఎక్కువగా ఉంది. ఇక, గ్రూప్-ఎలో ఇప్పటికే భారత్, న్యూజిలాండ్ సెమీస్ కు చేరిన సంగతి తెలిసిందే. ఆదివారం ఈ రెండు జట్ల మధ్య జరిగే మ్యాచ్లో గెలిచిన టీమ్ గ్రూప్లో అగ్రస్థానంలో నిలుస్తుంది.

టికెట్ ఇస్తామన్నారు కానీ..

# :రాజకీయాల్లోకి ఎంట్రీపై ప్రీతి జింటా

నటి ప్రీతి జింటా తన రాజకీయ రంగ ప్రవేశం గురించి ప్రస్తావించారు.

తాజాగా ఆమె ఎక్స్ వేదికగా అభిమానులతో ముచ్చటించారు.



సినీ రంగంలో ప్రతిభ చూపిన ఎంతోమంది రాజకీయాల్లోకి ప్రవేశించి ప్రజాసేవలో మునిగిపోతున్నారు. తాజాగా నటి ప్రీతి జింటా తన రాజకీయరంగ ప్రవేశం గురించి ప్రస్తావించారు. సోషల్ మీడియా వేదికగా అభిమానులతో ముచ్చటించిన ప్రీతి ఈ విషయంపై మాట్లాడారు. గతంలో కొన్ని రాజకీయ పార్టీలు టికెట్ కూడా ఆఫర్ చేశాయన్నారు. 'జవాన్ల కుటుంబంలో పుట్టావు కాబట్టి నువ్వు కూడా నా దృష్టిలో జవానువే. నీ ప్రతిభకు హ్యాట్సాఫ్. రాజకీయాల్లో చేరాలనే ప్రణాళికలు ఉన్నాయా? ఈ విషయం తెలుసుకోవడం కోసం ఎంతోమంది ఆసక్తిగా ఉన్నారు' అని ఓ అభిమాని అడగ్గా.. ప్రీతి స్పందించారు. "నాకు అలాంటి ఉద్దేశం లేదు. గతంలో నాకు కొన్ని రాజకీయ పార్టీలు టికెట్, రాజ్యసభ సీటు ఆఫర్ చేశాయి. నేను మార్యాదపూర్వకంగా వాటిని తిరస్కరించాను. ఎందుకంటే నాకు ఆ రంగంపై ఆసక్తి లేదు. నన్ను సోల్జర్ అని పిలవడం తప్పు కాదు.. నేను సైనికుడి కుమార్తెను, సైనికుడి సోదరిని కూడా. మేము ఉత్తర భారతీయులం, దక్షిణ భారతీయులం, బెంగాలీలమో కాదు.. మేము భారతీయులం. దేశభక్తి, జాతీయగర్వం మా రక్తంలోనే ఉంది" అని అన్నారు. మీరు ఎదుర్కొన్న కొన్ని విషయాల కారణంగా రాజకీయాల గురించి ఈ అభిప్రాయం తీసుకున్నారా? అని మరో అభిమాని అడగ్గా.. సోషల్ మీడియా విషపూరితంగా మారిందని ప్రీతి అభిప్రాయపడ్డారు. "సోషల్ మీడియా ఎంత విషపూరితంగా మారిందో.. చేసే ప్రతి కామెంట్ను రాజకీయాలతో ముడిపెడుతున్నారు. నేను రాజకీయ నాయకురాలిని కాదు. నాకు వాటిపై ఆసక్తి లేదు. సున్నితమైన భావాలు కలిగిన సాధారణ మహిళని" అన్నారు. మణిరత్నం దర్శకత్వంలో వచ్చిన 'దిల్ సే'తో వెండితెరకు పరిచయమయ్యారు నటి ప్రీతి జింటా. ఆ చిత్రంలో షారుక్తో కలిసి ఆమె సందడి చేశారు. తొలి చిత్రంతోనే గుర్తింపుతెచ్చుకున్నారు. 'ప్రేమంటే ఇదేరా'తో తెలుగువారిని పలకరించారు. అనంతరం వరుస బాలీవుడ్ సినిమాలతో స్టార్ హీరోయిన్ గా ఎదిగారు.

రిపబ్లిక్ సినిమా CINEMA

# బాబీ దేవోల్ పాత్ర అలా క్రియేట్ చేయడానికి కారణమదే: సందీప్ రెడ్డి వంగా

'యానిమల్‌లో విలన్‌గా కనిపించి ప్రేక్షకులను అలరించారు నటుడు బాబీ దేవోల్. యాక్షన్ డ్రామా ఫిల్మ్ గా రూపొందిన ఈ చిత్రంలో విలన్ పాత్రను విభిన్నంగా క్రియేట్ చేయడంపై దర్శకుడు సందీప్ రెడ్డి వంగా స్పందించారు.



'యానిమల్'తో బాక్సాఫీస్ వద్ద విజయాన్ని అందుకున్నారు దర్శకుడు సందీప్ రెడ్డి వంగా. యాక్షన్ డ్రామా ఫిల్మ్ గా రూపొందిన ఈ సినిమా విడుదలైనప్పుడు ప్రతి నాయకుడి పాత్ర గురించే అందరూ మాట్లాడుకున్నారు. విలనన్ను బధిరుడిగా చూపించడాన్ని సినీ ప్రముఖులు సైతం మెచ్చుకున్నారు. సినిమాలో ఎంతో కీలకమైన ఆ పాత్రను ఆవిధంగా చూపించడం వెనకున్న ఆంతర్యం గురించి తాజా ఇంటర్వ్యూలో సందీప్ రెడ్డి వంగా స్పందించారు. "యానిమల్లో అబ్రార్ పాత్రలో కనిపించి ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నారు బాబీ దేవోల్. స్క్రీన్పై కనిపించేది కొంత సమయమే అయినప్పటికీ తన ప్రదర్శనతో ఆయన అందరి దృష్టిని ఆకర్షించారు. ఇందులో ఆయన పాత్రను బధిరుడిగా ఎందుకు చూపించారంటూ చాలామంది నన్ను అడిగారు. నా ఉద్దేశం ఒక్కటే. సాధారణంగా మన సినిమాల్లో విలన్ అంటేనే ఇలాగే ఉంటాడు అనే ముద్ర పడిపోయింది. హీరో, విలన్ తిట్టుకోవడం, సినిమా చివరి వరకూ వారిద్దరి మధ్య మాటల యుద్ధాలు ఉంటుంటాయి. ఈ క్రమంలోనే మా సినిమాలో ప్రతి నాయకుడి పాత్రను విభిన్నంగా చూపించాలనుకున్నా. అందుకే ఆ పాత్రను అలా సృష్టించా. ఆ ఆలోచన నాకెంతో కొత్తగా అనిపించింది" అని సందీప్ రెడ్డి వంగా తెలిపారు. 2023లో విడుదలైన ఈ సినిమా అంతటా విజయాన్ని అందుకుంది. ఈ సినిమా తర్వాత బాబీదేవోలు బాలీవుడ్లోనే కాకుండా తెలుగులోనూ అవకాశాలు సొంతం చేసుకున్నారు. ఇందులో నటించడంపై బాబీదేవోల్ సైతం గతంలో స్పందించారు. ఈ సినిమాతో తన కెరీర్ తిరిగి మొదలైందని అన్నారు. తన పాత్రకు వచ్చిన స్పందనపై ఆనందం వ్యక్తంచేశారు. ప్రస్తుతం ఆయన చేతిలో 'జన నాయగన్', 'హరిహర వీరమల్లు', 'అల్ఫా' చిత్రాలు ఉన్నాయి.

## ఇంటి చిట్కాలు


# మొక్కలు వాడిపోకుండా ఎండల నుంచి కాపాడే సహజ ఎరువులు, ఇంట్లోనే సులభంగా చేసుకోవచ్చు ఎలాగంటే

ఎండల దెబ్బకి మొక్కలు ఎండిపోతాయి. ఇప్పటికే చాలా మొక్కలు ఎండిపోవడం ప్రారంభించాయి. అందుకే మొక్కల్ని కాపాడుకోవడం చాలా ముఖ్యం. ఎండలకు తట్టుకుని నిలబడటానికి మొక్కలకు చల్లదనం అవసరం.

వేసవి కాలం రాబోతుంది. ఇప్పటికే ఎండలు దంచికొడుతున్నాయి. ఎండలకి మనుషులే కాదు మొక్కలు కూడా అల్లాడిపోతాయి. ఎండల దెబ్బకి మొక్కలు ఎండిపోతాయి. ఇప్పటికే చాలా మొక్కలు ఎండిపోవడం ప్రారంభించాయి. అందుకే మొక్కల్ని కాపాడుకోవడం చాలా ముఖ్యం. ఎండలకు తట్టుకుని నిలబడటానికి మొక్కలకు చల్లదనం అవసరం. మొక్కలకి చల్లదనాన్ని ఇవ్వడానికి కొన్ని ఎరువులు సాయపడతాయి. ఈ ఎరువుల వల్ల మొక్కలు పోషకాలతో పాటు చల్లదనాన్ని కూడా పొందుతాయి. వేసవిలో, ఎక్కువగా ద్రవ ఎరువులను వాడాలి. వీటిలో నత్రజని, కాల్షియం, సల్ఫర్, మెగ్నీషియం వంటి పోషకాలు ఉంటాయి. ఇవి మొక్కలకు మంచి పోషణను అందిస్తాయి. పెరుగుతున్న ఉష్ణోగ్రతల వల్ల మొక్కలు ఎండిపోవు. అలాంటి నాలుగు ఎరువులు ఎలా తయారు చేయాలో ఇక్కడ తెలుసుకుందాం.



### ఆవు పేడ ఎరువు



సులభంగా లభించే ఎరువులలో ముందుగా గుర్తుకు వచ్చే పేరు ఆవు పేడ. ఇది ఇంటి తోటపనికి బాగా పనికివస్తుంది. అంతేకాకుండా సులభంగా లభిస్తుంది. దీనిని తయారు చేయడానికి, ఆవు పేడ పిడకల్ని ఒక బకెట్ నీటిలో వేసి, మూతపెట్టి 3 రోజులు అలాగే ఉంచండి. 3 రోజుల తర్వాత, దానిని మరొక పాత్రలోకి వడకట్టండి. ఈ మిశ్రమాన్ని ప్రతి 2 నుంచి 3 రోజులకు ఒకసారి మొక్క మట్టిలో కలపండి. మీరు కావాలనుకుంటే దీనిని ద్రవ ఎరువుగా ఉపయోగించవచ్చు.

### మజ్జిగతో ఎరువు



పెరుగును బాగా చిలికి వెన్న తీసిన తర్వాత మిగిలిన మజ్జిగను కూడా మొక్కలకు ఎరువుగా ఉపయోగించవచ్చు. ఇందుకోసం ఇంట్లో తయారుచేసిన మజ్జిగను ప్లాస్టిక్ బకెట్‌లో నింపండి. ఆ తర్వాత దాని ఓ మూత పెట్టి పది రోజులు అలానే ఉంచండి. ఈ సమయంలో మజ్జిగ బాగా పులిసిపోతాయి. ఆ తర్వాత ఒక లీటర్ నీటిలో 200 మి.లీ మజ్జిగను కలపండి. బాగా కలిపిన తర్వాత ఈ మిశ్రమాన్ని 500 మి.లీ చొప్పును మొక్కకు పోయాలి. ఈ మిశ్రమం వల్ల మొక్కకు చల్లదనంతో పాటు పోషకాలు కూడా బాగా అందుతాయి.

### వేప పిండి




వేప పిండిని కూడా చల్లని ఎరువుగా మొక్కలకు ఉపయోగించవచ్చు. నిజానికి వేప పిండి మొక్కలో నత్రజని లభ్యతను పెంచుతుంది. దీనిని ఉపయోగించడానికి ముందుగా 50% తోట మట్టి, 30% ఆవు పేడ ఎరువు, 20% వేప పిండి మిశ్రమాన్ని బాగా కలపండి. ఇప్పుడు దానిపై తేలికగా నీళ్లు చల్లండి. ఆ తర్వాత దీనిని మొక్కలకు ఎరువుగా ఉపయోగించవచ్చు. మొక్కలో మట్టిలో ఈ మిశ్రమాన్ని కలిపితే సరిపోతుంది.

### ఎండిన ఆకుల కంపోస్ట్



చెట్లు, మొక్కల నుంచి ఎండిన ఆకులు రాలి కింద పడతాయి. ఇలాంటి ఆకుల్ని చెత్తగా పారేసే బదులు మొక్కలకు ఎరువుగా ఉపయోగించవచ్చు. వీటిని సేంద్రీయ ఎరువులు అంటారు. ఇది నేలను సారవంతం చేయడానికి పనిచేస్తుంది. ఇది గరిష్ఠంగా నీటిని గ్రహించే సామర్థ్యాన్ని కలిగి ఉంటుంది. వేసవిలో మొక్కల వేర్లను చల్లగా ఉంచడానికి దీనిని ఉపయోగించవచ్చు. ఇందుకోసం ఎండిన ఆకుల్ని తీసుకుని చిన్న చిన్న ముక్కలుగా కట్ చేసుకుని ఒక బక్కెట్‌లోకి తీసుకోండి. వీటిపై కొంచెం నీళ్లు చల్లండి. ఆ తర్వాత మూతపెట్టి కొన్ని రోజులు అలాగే ఉంచండి. మధ్యమధ్యలో మూత తీసి బాగా కలిపి నీళ్లు చల్లుతూ ఉండండి. కొన్ని రోజుల తర్వాత ఎరువు సిద్ధంగా ఉంటుంది. ఒక మొక్కకు గుప్పెడు ఎరువు తీసుకుని మొదళ్లలో చల్లండి. ఆపై తేలికగా నీరు పెట్టండి. ఇలా చేయడం వల్ల మొక్కలకు తగిన పోషణ అంది అవి ఎండిపోవు.

### ఉల్లిపొట్టు



ఉల్లి పొట్టు కూడా మొక్కలకు సహజ ఎరువుగా పనిచేస్తుంది. మొక్కలు ఎండిపోకుండా నివారించడంలో ఉల్లిపొట్టు కీలక పాత్ర పోషిస్తుంది. ఉల్లి పొట్టును అలా మొక్కల పొదల్లో వేసినా సరిపోతుంది. లేదంటే.. ఐదు లీటర్ల గోరు వెచ్చని వాటర్‌లో ఓ ఇరవై నుంచి ముప్పై గ్రాముల ఉల్లిపొట్టుని వేసి నాలుగు రోజుల పాటు అలానే ఉంచాలి. ఆ తర్వాత ఈ మిశ్రమాన్ని మొక్కలపై పిచికారీ వేస్తే.. అవి ఎండిపోకుండా బాగా పెరుగుతాయని నిపుణులు చెబుతున్నారు.



**గమనిక**

ఇది సోషల్ సమాచారం మాత్రమే. కొన్ని అధ్యయనాలు, సంబంధిత నిపుణుల ప్రకారం ఈ వివరాలు అందించాం. వీటిని పాటించేముందు.. సంబంధిత నిపుణుడిని సంప్రదించడం శ్రేయస్కరం. ఈ విషయాల్ని సమయం తెలుగు ధృవీకరించడం లేదు.